

సార్..సమస్యలు పరిష్కరించండి

కలెక్టరేట్‌లో 4నెలల తర్వాత కలెక్టర్ షణ్మోహన్ ఆధ్వర్యంలో ప్రజాపరిష్కార వేదిక నిర్వహించారు. - 8లో



'సుందరం'.. సుమనోహరం

తిరుచానూరులో తెప్పోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు సుందరరాజ స్వామి తెప్పపై విహరించారు. - 8లో



యాజమాన్యంతో అధిక దిగుబడి

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

ఎన్నికల నిర్వహణ లెక్కలు ఇవ్వండి

– పోటీ చేసిన అభ్యర్థులకు కలెక్టర్ నోటీసులు

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు వ్యయ నిర్వహణకు సంబంధించిన లెక్కలను అందచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ నోటీసులు జారీ చేశారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు, ఓ పార్లమెంటు స్థానానికి సంబంధించి పోటీ చేసిన అభ్యర్థులకు, ఆయా అసెంబ్లీ రిటర్నింగ్ అధికారుల ద్వారా కలెక్టర్ సంతకం ఉన్న నోటీసులు వెళుతున్నాయి. మార్చి 13న సార్వత్రిక ఎన్నికలు, జూన్ 4న ఫలితాలు వెలువడిన విషయం తెలిసిందే. అభ్యర్థులు రోజువారీ ఖర్చుల వివరాలు, రశీదులు, నగదు రిజిస్టర్, బ్యాంకు రిజిస్టర్, పూర్తి వ్యయ నిర్వహణ పత్రంతో పాటు చివరల్లో వీటిని ధ్రువపరుస్తూ అఫిడవిట్ కూడా అందజేయాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన 26వ రోజుల్లో వ్యయ నిర్వహణపై అభ్యర్థులు లెక్కలను ఎన్నికల సంఘానికి అందచేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నోటీసులు తీసుకున్న ప్రతి అభ్యర్థి మూడు రోజుల్లో ఎన్నికల వ్యయ నిర్వహణ లెక్కలను నిర్ణీత నమూనాలో అందచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్‌లో 64శాతం ఉత్తీర్ణత

చిత్తూరు కార్పొరేషన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్‌లో 64శాతం ఉత్తీర్ణత(8వ స్థానం) సాధించినట్లు జిల్లా ఇంటర్‌మీడియట్ అధికారి సయ్యద్ మౌలా మంగళవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 4,742 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 3,043మంది ఉత్తీర్ణతతో 64శాతం ఫలితాలు వచ్చినట్లు పేర్కొన్నారు. ఇంటర్ వృత్తి విద్యా కోర్సుల్లో 750 మంది పరీక్ష రాయగా 380 మంది పాసై 51శాతం ఫలితాలు వచ్చినట్లు తెలిపారు. జిల్లాలోని 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన 1,522 మంది పరీక్షలు రాయగా 1,029, 13 హైస్కూల్ ప్లస్‌లోని 110 మందికి గాను 81 మంది, నాలుగు కేజీబీవీల్లో 27 మందికిగాను 12 మంది, 6 ఆదర్శ పాఠశాలల్లో 164 మందికి గాను 105 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు.

పీఎం కిసాన్ నిధుల విడుదల

చిత్తూరు అగ్రికల్చర్: ఈ ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు ముందస్తు పెట్టుబడి నిధిగా కేంద్ర ప్రభుత్వం మంగళవారం పీఎం కిసాన్ నిధులను విడుదల చేసింది. ప్రతి రైతుకు రూ.2వేలు చొప్పున జిల్లాలో మొత్తం 1,75,051 మంది రైతులకు రూ.35.01 కోట్లు మేరకు నిధులు విడుదల అయ్యాయి. ఈ నిధులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమకానున్నట్లు వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణా తెలిపారు.

ముక్కంటి సేవకు పోటెత్తిన భక్తులు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. సుమారు 26వేల మంది స్వామివారిని దర్శించుకున్న ట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం ద్వారా 1,550మంది, రూ.50 ప్రత్యేక దర్శనం ద్వారా 2,700మంది భక్తులు సేవించుకున్నట్లు వెల్లడించారు. రూ.500 రాహు కేతు పూజల్లో 2,725మంది, రూ.750 పూజల్లో 1,185 మంది, రూ.1,500 పూజల్లో 308 మంది, రూ.2,500 పూజల్లో 270 మంది, రూ.5వేల పూజల్లో 73మంది భక్తులు పాల్గొన్నట్లు వివరించారు.

పార్ట్‌టైమ్ మోసం!

- చిత్తూరు నగరంలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన యువతి రెండు నెలలుగా ఇంటి వద్దనే ఖాళీగా ఉంటోంది. ఆన్‌లైన్‌లో జాబ్ కోసం వెతుకుతూ ఓ వెబ్ లింక్ క్లిక్ చేసింది. ప్రతిగా వారు ఇంటి వద్ద ఉంటూనే మీరు కొంత సొమ్ము పెట్టుబడిగా పెడితే అంతకు రెట్టింపు వస్తుందని నమ్మబలికారు. మొదట్లో కొంత సొమ్మును ఖాతాకు పంపించారు. తర్వాత విడతల వారీగా రూ.3 లక్షల వరకు వసూలు వేశారు. తర్వాత వారి నంబర్లు, వాట్సాప్ గ్రూపులు బ్లాక్ చేశారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.
- గుడిపాల మండలానికి చెందిన ఓ ప్రభుత్వోద్యోగి. నెలకు వేలల్లో సంపాదన. అయినా ఖాళీ సమయంలో డబ్బులు సంపాదించాలనే ఆశతో వర్క్ ఫ్రమ్ హోమ్ పేరిట ఆన్‌లైన్ టాస్క్‌లో పాల్గొన్నాడు. మొదట్లో డబ్బులు వస్తున్నట్లే వచ్చి, చివరికి రూ.4 లక్షల వరకు పోగొట్టుకుని బోరుమన్నాడు.
- పలమనేరు పట్టణంలోని తాలూకచ్చేరి కాలనీకి చెందిన ఇంజినీరింగ్ పూర్తి చేసిన యువతి పత్రికల్లో వచ్చిన ఆన్‌లైన్ ఉద్యోగ ప్రకటన చూసింది. అది మోసపూరితమైందా... కాదా అన్నది తెలుసుకోకుండానే రూ.లక్షల్లో వేతనం ఉంటుందని వారు చెప్పిందల్లా నమ్మి విడతలుగా రూ.2 లక్షల వరకు చెల్లించింది. వారు ఫోన్లు ఎత్తడం మానేయడంతో మోసపోయినట్లు గ్రహించి 1930 సైబర్ సెల్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసింది.
- పూతలపట్టులో ఇంజినీరింగ్ చదివిన ఒక యువతి రూ.2.60 లక్షలు, గంగాధరనెల్లూరులో నిరుద్యోగ యువకుడు రూ.1.60 లక్షలు, పి.కొత్తకోట సమీపంలో ఓ వివాహిత రూ.2.40 లక్షలు.. ఇలాంటి ఆన్‌లైన్ సైట్లు, ఉద్యోగ ప్రకటనలు చూసి మోసపోయా రు. ఇటీవలే ఈ ఘటనలన్నీ చోటుచేసుకున్నాయి.



సరికొత్త విధానాలతో సైబర్ నేరగాళ్లు మాయ జేస్తున్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన వారిని సైతం సులువుగా బురిడీ కొట్టిస్తున్నారు. ఉద్యోగాల పేరిట వల విసిరి రూ.లక్షలు దోచేస్తున్నారు. నిరుద్యోగ యువతే లక్ష్యంగా పార్ట్‌టైమ్ జాబ్‌లంటూ మోసం చేస్తున్నారు. నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని ఆన్‌లైన్ ప్రకటనలతో గారడీ చేసి బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. కేటుగాళ్ల బారిన పడిన బాధితులు చివరకు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

- కూర్చున్నచోటే ఉద్యోగాలంటూ యువతకు గాలం
- చిక్కుకున్నాక రూ.వేల నుంచి రూ.లక్షల్లో దోపిడీ
- జిల్లాలో పెరుగుతున్న ఆన్‌లైన్ జాబ్ బాధితులు
- స్టేషన్‌కు వెళ్లలేక కొందరు.. పరువు కోసం మరికొందరు..

చిత్తూరు అర్బన్: ఇటీవల ఆన్‌లైన్ ఉద్యోగాల బాధితులు పెరుగుతున్నారు. ఆన్‌లైన్ జాబ్ ఫ్రాడ్స్, పార్ట్‌టైమ్ జాబ్‌ఫ్రాడ్స్, డేటా ఎంట్రీ స్కామ్స్, వర్క్ ఫ్రం హోమ్ జాబ్ స్కామ్స్ తరహా మోసాల్లో బాగా చదువుకున్న యువతే చిక్కుకుంటున్నారు. ఆన్‌లైన్ జాబ్ సైట్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్, పత్రికల్లో నకిలీ ప్రకటనలు నమ్మి మోసపోతున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనే బలహీనత ఉన్న వారు ఇలాంటి మోసగాళ్ల ఉచ్చులో పడి తమ బ్యాంకు ఖాతాలు ఖాళీ చేసుకుంటున్నారు. వీరిలో ఎక్కువ శాతం ఇంజినీరింగ్ చదివిని వారితోపాటు ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ప్రైవేటు ఉద్యోగులు, నిరుద్యోగ యువత ఉండడం గమనార్హం.

వాళ్లే లక్ష్యం..

చాలా మంది ఎక్కువగా ఇంటి వద్ద ఉంటూ పనిచేయడానికే ఇష్టపడతారు. జాబ్ స్కామ్ చేసేవాళ్లు వీరినే టార్గెట్ చేసుకుంటున్నారు. తక్కువ సమయం, తక్కువ శ్రమతోనే నెలకు వేలాది రూపాయలు సంపాదించగల జాబ్స్ తమ వద్ద ఉన్నాయంటూ తరచూ ఆన్‌లైన్‌లో ప్రకటనలు ఇస్తుంటారు. ఎవరైనా వీటిని నమ్మి సంప్రదిస్తే ఫీజులు, చార్జీల రూపంలో డబ్బులు కట్టించుకుని మోసగిస్తారు. ఈ ప్రకటనలు ఆన్‌లైన్‌లోనే కనిపిస్తాయి. వాట్సాప్ ఫార్వర్డ్ రూపంలోనూ ఉంటాయి.

బ్లాక్‌మెయిల్..

డేటా ఎంట్రీ స్కామ్స్ రకరకాలుగా ఉంటాయి. ఎక్కువ స్కిల్స్ అవసరం లేకుండానే సింపుల్ డేటా ఎంట్రీ చేస్తే చాలు డబ్బులు సంపాదించొచ్చని నమ్మబలుకుతారు. ముందుగానే ప్రాసెసింగ్ ఫీజు, ట్రైనింగ్ ఫీజు రూపంలో అడ్వాన్స్ పేమెంట్ చేయించుకుంటారు. డేటా ఎంట్రీ అనంతరం అందులో తప్పులు ఉన్నాయని, దాని వల్ల సంస్థ నష్టపోయిందని, నష్ట పరిహారం చెల్లించాలని, లేకుంటే లీగల్ ప్రొసీడింగ్స్‌కు వెళతామని బెదిరించి అధిక మొత్తంలో తిరిగి డబ్బులు వసూలు చేస్తారు.

నిజం లాంటి అబద్ధం..

నకిలీ ఉద్యోగాల్లో సైబర్ నేరగాళ్ల వద్ద అందరి బయోడేటా ఉంటుంది. ఆన్‌లైన్ జాబ్ సెర్చింగ్ సైట్లకు జనం ఇచ్చే బయోడేటాలు వీరు సేకరిస్తుంటారు. ఒక కాల్ సెంటర్ వంటి సెటప్ ఏర్పాటు చేసుకుని జాబ్ కన్సల్టెన్సీ ముసుగులో వారి నుంచి ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్లుగా మోసపూరిత మెయిళ్లను పంపిస్తారు. ఆ మెయిల్‌కు స్పందిస్తే.. అసలైన జాబ్ నిర్వహించే ప్రక్రియనే వీరూ అనుసరిస్తారు. అలా మోసం చేస్తూ నిరుద్యోగి నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ చార్జీలు, యూనిఫాం అడ్వాన్స్, సెక్యూరిటీ డిపాజిట్ వంటి పేర్లతో దోచుకుని తర్వాత మాయమైపోతారు.



ఇలా గుర్తించాలి..

- ఉద్యోగ ప్రకటనలు అన్నీ నిజంకావు అనే సత్యాన్ని గ్రహించాలి.
- సాధారణంగా ప్రముఖ సంస్థలు ఎప్పుడూ రిజిస్ట్రేషన్ ఫీజు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఫీజు పేరిట నగదు వసూలు చేయవు.
- ప్రకటనల్లో ఉపయోగించే లోగోలు, లెటర్లను ఒకటికి రెండుసార్లు గమనించాలి.
- అసలైన సంస్థ ఎప్పుడూ ఈ-మెయిల్ ద్వారానే సమాచారం ఇస్తారు. కానీ జాబ్‌స్కామ్/ఫ్రాడ్ చేసేవారు పంపే మెయిల్‌ను గమనిస్తే కాస్త తేడాగా ఉంటాయి.
- జాబ్ స్కామ్ వారు ఇచ్చే ఉద్యోగ ప్రకటనల్లో గానీ, ఈ-మెయిల్స్‌లో గానీ ఎక్కువగా గ్రామర్ తప్పులు ఉంటాయి. జాబ్ డిస్క్రిప్షన్ కూడా అస్పష్టంగా ఉంటుంది.
- క్విక్ మనీ, అన్ లిమిటెడ్ ఎర్నింగ్స్, ఎలాంటి టెక్నికల్ స్కిల్స్ అవసరం లేదు అనే పదాలు చూసిన వెంటనే అప్రమత్తమవ్వాలి. ఒక చట్టబద్ధమైన సంస్థ ఎప్పుడూ ఇలాంటివి చేయదన్నది గ్రహించాలి.
- ఈ తరహా మోసాలకు గురయ్యేవారు 1930 సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేయాలి. మీ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలి.

చదువుకున్న వాళ్లు ఇలాగా?



విద్యావంతులు, యువతీ యువకులు ఉద్యోగాల కోసం డబ్బులు ఇవ్వడం అనేది తప్పు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం డబ్బులు తీసుకోవడం ఎంత నేరమో, ఇవ్వడం కూడా అంతే నేరం. నగదు తీసుకున్న వారితో పాటు ఇచ్చిన వారిపై కూడా క్రిమినల్ కేసులు పెడతాం. ఇక ప్రైవేటు రంగాల విషయానికి వస్తే.. మీలో నైపుణ్యం పెంచుకోవడానికి కోచింగ్ సెంటర్‌కు వెళ్లి కొత్త కోర్సులు నేర్చుకోవడానికి డబ్బులు పెట్టండి. అంతేగానీ, పరిచయంలేని వ్యక్తులకు ఎందుకు రూ.లక్షలు ఇస్తున్నారో తెలియడంలేదు. తల్లిదండ్రులు కూడా పిల్లలు ఏం చేస్తుంటారన్నది గ్రహిస్తే మంచిది. ఆన్‌లైన్ జాబ్ ప్రకటనలు ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవాలి. మోసపోయామని గ్రహిస్తే సమీప పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ధైర్యంగా ఫిర్యాదు చేయండి. కేసు నమోదు చేస్తాం.

– మణికంఠ, ఎస్పీ, చిత్తూరు

మోహనరూపా గోపాలా..



హంస వాహనంపై విహరిస్తున్న స్వామివారు



ఊంజల్ సేవలో స్వామివారు



చిన్నశేష వాహనంపై శ్రీవారి చిద్విలాసం

పుత్తూరు: అప్పలాయగుంటలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు మంగళవారం ఉదయం చిన్న శేష వాహనంపై స్వామివారు మోహనకృష్ణుడి అలంకరణలో, రాత్రి హంస వాహనంపై చదువులతల్లిగా విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. సుప్రభాత సేవతో శ్రీస్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, అర్చన, మొదటి గంట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులను స్వామివారి సర్వదర్శనానికి అనుమతించారు. 8గంటలకు చిన్న శేష వాహనంపై మోహనకృష్ణుడి అలంకారంలో స్వామివారు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను దర్శనం ఇచ్చారు. పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలు ధరించి స్వామివారు చిన్న శేష వాహనంపై విహరిస్తుండగా భక్తులు వీక్షించి తరించారు. సాయంత్రం 5 గంటలకు ఊంజల్ మండపంలోకి శ్రీవారు వేంచేపు చేశారు. 5–30 నుంచి 6–30 గంటల వరకు భక్తి కీర్తనల ఆలపనల నడుమ ఊంజల్ సేవ నేత్రపర్వంగా సాగింది. అనంతరం స్వామివారు వాహన మండపంలోకి వేంచేపు చేశారు. స్వామివారిని శ్రీసరస్వతీదేవిగా సర్వాంగ సుందరంగా అలంకరించి హంస వాహనంపై కొలువుదీర్చారు. తదుపరి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు నయనానందకరంగా సాగింది. భక్తులు అడుగడుగునా నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. వాహన సేవ ఆలయానికి చేరుకున్న అనంతరం స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. ఏఈఓ రమేష్, ఆలయ సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు...

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సింహ వాహనంపై స్వామివారు దర్శనమిస్తారు. సాయంత్రం 5–30 నుంచి 6–30 వరకు ఊంజల్ సేవ, రాత్రి 7 గంటల నుంచి 8 వరకు ముత్యపు పందిరి వాహనంపై స్వామివారు విహరిస్తారు.

విద్యుత్ సమస్యలు తక్షణ పరిష్కారం

- సబ్ స్టేషన్లలో ఫిర్యాదుల పుస్తకం
- ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు



అధికారులతో సమీక్షిస్తున్న ఎస్ఈ సురేంద్రనాయుడు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు ఆదేశించారు. మంగళవారం చిత్తూరు రూరల్ ఈఈ కార్యాలయంలో అర్బన్, రూరల్ డివిజన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి సబ్‌స్టేషన్‌లో ఫిర్యాదుల నమోదు పుస్తకాన్ని అందుబాటులోకి తీసుకు వస్తామని, వినియోగదారులు సమస్యను అందులో నమోదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారాలను డీఈ స్థాయి అధికారి పర్యవేక్షణ చేస్తారని పేర్కొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా ఇవ్వాలని, అందుకు తగినట్లు లైన్ల నిర్వహణ ఉండాలని తెలిపారు. జూనియర్ లైన్‌మెన్ నుంచి ఏఈ వరకు సంబంధిత సెక్షన్ల పరిధిలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. జిల్లా వాసి అయిన తనకు ఇక్కడ పలు క్యాడర్లలో పనిచేసిన అనుభవం ఉందని, స్థానిక సమస్యలపై అవగాహన ఉందన్నారు. డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. శాఖకు ఆదాయమైన విద్యుత్ బిల్లుల వసూళ్లను సకాలంలో వసూలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఏఓ శ్రీనివాసులు, ఈఈలు హరి, మునిచంద్ర, ఏఏఓ గీత, డీఈలు పద్మనాభపిళ్లై, శేషాద్రి, జ్ఞానేశ్వర్, జయప్రకాష్, ఆనంద్, ఏఈలు, సబ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలపై శిక్షణ

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లావైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం కాంప్రెహెన్సీవ్ క్యాన్సర్ కేర్ రెండవ విడత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని ఏఎన్ఎం, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు 30 మంది హాజరయ్యారు. ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ వెంకటప్రసాద్ మాట్లాడుతూ 30 సంవత్సరాలు పైబడిన వారికి వివిధ రకాల సర్వైకల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్‌పై స్క్రీనింగ్ ఏ విధంగా చేయాలో వివరించారు. శిక్షణ పొందిన వారు స్క్రీనింగ్‌ను పక్కాగా నిర్వర్తించాలని ఆదేశించారు. కార్యక్రమం అధికారులు శిరీష, హర్షవర్ధన్, శ్రీవాణి, దేవరాజ్, మీనా సయ్యద్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

బె'ధర'గొడుతున్న మామిడి

మామిడి రైతుల జీవితాల్లో తియ్యదనం కరువైంది. దిగుబడి తక్కువగా ఉండడంతో ధరలు బాగుంటాయని ఆశించిన మామిడి రైతులకు నిరాశే ఎదురవుతోంది. గత నెల చివరి వరకు టన్ను రూ.28వేలు దాకా ఉన్న ధరలు ఈనెల మొదటి వారం నుంచి అమాంతం తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం టన్ను రూ.21 వేలకు పడిపోయింది. దీంతో మామిడి రైతులకు నష్టాలు తప్పడం లేదు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు జిల్లా కలెక్టర్, ఉద్యానవనశాఖ అధికారులతో కలసి తగు చర్యలు తీసుకున్నా పల్ప్ యాజమాన్యాలు రింగై ధరలను నియంత్రించడం కారణంగా నష్టాలు తప్పడం లేదని మామిడి రైతులు ఆరోపిస్తున్నారు.

- వర్షాలు లేక పంట దిగుబడి అంతంతమాత్రమే
- గుజ్జు పరిశ్రమల సిండికేట్‌తో ధరల పతనం
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు
- ప్రస్తుత వర్షాలతో బూజురోగంతో నేలరాలుతున్న మామిడి



పలమనేరు ప్రాంతంలో తోతాపురి రకం మామిడి తోట

పలమనేరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని రైతులకు ప్రధాన జీవనాధారం మామిడి. ఇక్కడ ఎక్కువగా తోతాపురి తోటలున్నాయి. ఈ దఫా పూత దశనుంచి వర్షాలు లేక పంట దిగుబడులు అంతంతమాత్రమే. ప్రస్తుతం మామిడి ధర అమాంతం తగ్గడంతో రైతులు డీలా పడుతున్నారు. ఈదఫా తోతాపూరీ, నీలం రకాలకు సంబంధించి సగం తోటల్లో పూత బాగానే పట్టింది. అయితే వర్షాలు లేకపోవడం అదే సమయంలో భారీ ఉష్ణోగ్రత కారణంగా కాయల్లో నాణ్యత లోపించింది. ఎండకు 20 శాతం పిందె నేలరాలింది. గత డిసెంబరు నుంచి మేనెల వరకు వర్షం జాడలేదు. దీంతో మామిడికి అవసరమైన సమయంలో వర్షాలు రాలేదు. ప్రస్తుత వర్షాల కారణంగా చెట్లలోని కాయలు తేనెబంక తెగుళ్ల కారణంగా నేలరాలుతున్నాయి. ఫలితంగా జిల్లాలోని తోటల్లో ఉన్న పంటలో 30శాతం పంట ఉత్పత్తి పోయినట్టే.

ధర లేకుంటే అంతే సంగతులు..

జిల్లాలో 20 మామిడి గుజ్జు పరిశ్రమలున్నాయి. ఇక్కడ పండిన పంటలో 60శాతం జిల్లాతోపాటు పొరుగు రాష్ట్రాల్లోని జ్యూస్ ఫాక్టరీలకు చేరుతోంది. మామిడి కాయలను పల్ప్(మామిడి గుజ్జు) తయారు చేసి ఇతర రాష్ట్రాలకే కాక విదేశాలకు సైతం ఎగుమతులు చేస్తుంటారు. ఏటా జూన్ నుంచి జూలై రెండోవారం దాకా ఇక్కడ సీజన్ నడుస్తుంది. కొన్ని ఫ్యాక్టరీలు రైతులతో అగ్రిమెంట్లు చేసుకుని డైరెక్ట్ మార్కెటింగ్ చేస్తుండగా మరికొన్ని ఫాక్టరీలు తమ ఏజెంట్ల ద్వారా మామిడిని కొనుగోలు చేయనున్నాయి. మిగిలిన రైతులు జిల్లాలోని దామల్‌చెరువు, తిరుపతి, బంగారుపాళ్యం, పుత్తూరు, చిత్తూరు, పలమనేరు, వీకోటలో మామిడి మండీలకు సరకును తరలిస్తారు. జిల్లాలో మామిడి 60 శాతం జ్యూస్ ఫ్యాక్టరీలకు(మ్యాంగో పల్ప్ కోసం) 20 శాతం తోటలపై వ్యాపారుల కొనుగోళ్లు, మరో 20శాతం రైతులు ప్రధానమార్కెట్‌లకు కాయలను ఏటా విక్రయిస్తున్నారు. కొందరు రైతులు మాత్రం నేరుగా ఫ్యాక్టరీలకే తోలుతుంటారు. ప్రస్తుతం తోటల్లోని కాయలు మరో రెండు, మూడు వారాలు మాత్రం ఉండే పరిస్థితి ఉంది. ఈ లోపు ధరలు ఆశాజనకంగా ఉంటే తప్ప మేలు కలగదు. తోటలు వడిగిపోయాక ధరలొచ్చినా లాభం ఉండదని రైతులు పేర్కొంటున్నారు. గిట్టు ధరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జిల్లాలో మామిడి సాగు ఇలా..

- మొత్తం మామిడి సాగు 1.12 లక్షల హెక్టార్లు
- మామిడి రైతులు దాదాపుగా 60 వేలదాకా
- ఈదఫా కాపుకాచిన తోటలు: 87వేల హెక్టార్లు
- ప్రధాన వెరైటీలు: తోతాపురి, నీలం, ఖాదర్
- జిల్లాలో తోతాపురి సాగు: 68వేల హెక్టార్లు
- మొత్తం సగటు పంట దిగుబడి: 8లక్షల టన్నులు
- ఈదఫా తోతాపురి దిగుబడి 4 లక్షల టన్నులు

మామిడి ధరలిలా..

రకం	గత ఏడాది టన్ను (ధర)	ఈదఫా ధర
తోతాపురి	38వేలు	రూ.21 వేలు
చందూరా	26వేలు	రూ.18 వేలు
నాటు	15వేలు	రూ.11వేలు
ఖాదర్	60వేలు	రూ.45 వేలు
బేనీషా	70వేలు	రూ.60వేలు
మల్లిక	60వేలు	రూ.50వేలు

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



గత ఐదేళ్లుగా మామిడి సీజన్‌లో పల్ప్ పరిశ్రమల సిండికేట్ కారణంగా ఆశించిన ధరలేక రైతులు, వ్యాపారులు నష్టపోతూనే ఉన్నారు. ఈసారి మామిడి దిగుబడి తక్కువగానే ఉంది. దీంతో ధరలు బాగుంటాయనుకున్నాం. గత నెలాఖరు వరకు ధరలు ఆశాజకనంగానే ఉన్నాయి. కానీ ఇప్పుడు తోతాపురి టన్నుపై ఆరువేలదాకా తగ్గింది. ఫ్యాక్టరీవాళ్ల రింగు కాకుండా వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తప్ప మామిడి రైతులకు మేలు జరగదు.

– నయాజ్, మామిడి వ్యాపారి, పలమనేరు

రూ.30వేలు ఉంటేనే గిట్టుబాటు



మామిడి తోట యాజమాన్యానికి ఏటా రూ.50 వేల దాకా ఖర్చు పెట్టాలి. మంచి దిగుబడి వస్తే ఎకరాకు 40 టన్నుల దాకా ఉంటుంది. ఆలెక్కన టన్ను ధర రూ.30 వేలైతేనే రైతుకు కొంత మిగులుతుంది. అది కూడా ఈ రెండువారాల్లో తోటల్లో కాయలున్నప్పుడే. కోసిన తర్వాత రేట్లను పెంచినా రైతుకు ప్రయోజనం ఉండదు. జిల్లా అధికారులు గుజ్జు ఫ్యాక్టరీ నిర్వాహకులతో మాట్లాడి మామిడి రైతులను ఆదుకోవాలి.

– సుబ్రమణ్యం నాయుడు, మామిడి రైతు, రామాపురం

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


సీమోన్ (ఫైల్)

గంగాధరనెల్లూరు: మండలంలోని చిత్తూరు–పుత్తూరు మార్గంలో రామానాయుడుపల్లె సమీపంలో కారు, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు .. గంగాధరనెల్లూరు మండలంలోని కట్టకింద పల్లె దళిత వాడకు చెందిన రాజేంద్రన్ కుమారుడు సీమోన్ (25) ద్విచక్ర వాహనంలో రామానాయుడుపల్లె వద్ద నుంచి వస్తున్నాడు. గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు, ద్విచక్ర వాహనం ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో సీమోన్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో క్షతగాత్రుడిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్ తెలిపారు.

పాముల సయ్యాట



కుప్పంరూరల్: కుప్పం పట్టణం మాడల్ కాలనీ వద్ద మంగళవారం పాముల సయ్యాట ఒక వైపు వింత..మరోవైపు భయాందోళనను రేకెత్తించింది. నాగుపాము, జెర్రిపోతు జనావాసాల సమీపానికి వచ్చిన సయ్యాట మొదలు పెట్టడంతో జనం పెద్ద చూసేందుకు ఎగబడ్డారు. అర్ధగంట అనంతరం పాములు చెరో దిక్కుకు వెళ్లి పోయాయి.

గోరక్షశాల..!


కాణిపాకం దేవస్థానం గోశాల

- కాణిపాకంలో మూగజీవులకు జీవం పోస్తున్న గోశాల
- భక్తుల సహకారంతో గో సంరక్షణ
- దత్తత పేరిట పేద రైతులకు కోడె దూడలు, ఎద్దులు

కాణిపాకం: పాడి, పంటకు గ్రామీణ భారతంతో విడదీయరాని సంబంధం ఉంది. ఆరోగ్యకర మానవ సమాజ నిర్మాణంలో జంతువుల స్థానం ఎంతో విశిష్టమైనది. అందులోనూ హైందవ ధర్మంలో గోవులకు ఎంతో ప్రాధాన్యత ఉంది. సాక్షాత్తు దేవతామూర్తిగా గోపూజ చేయడం భారతీయ సంప్రదాయం. ఇలాంటి గోవులకు గోసంరక్షణ కేంద్రాలు తమవంతు సేవలతో ఆదరిస్తున్నాయి. ఇదే రీతిలో కాణిపాక దేవస్థానం గోశాల సేవలతోనూ భక్తుల నుంచి ప్రశంసలు అందుకుంటోంది. భక్తుల సహకారం గోశాల గ్రాసానికి ఢోకా లేకుండా చూస్తోంది. ఫలితంగా అటు పేద రైతులకు..ఇటు ఆలయానికి పలు విధాలుగా ఉపయోకరంగా మారింది.

26 ఆవులతో మొదలై 187కు చేరిన గోవులు

కాణిపాకంలోని స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి 2008లో కొందరు భక్తులు గోదానం చేశారు. ఇలా అందిన మొత్తం 26 ఆవుల సంరక్షణకు ఓ షెడ్డును నిర్మించి గోశాలగా నామకరణం చేశారు. ఇప్పుడు ఈ గోశాలలో దేశీయ, గిర్, పుంగనూరు, ఒంగోలు, జెర్సీ, హెచ్ఎఫ్ తదితర జాతులకు సంబంధించిన ఆవులు, ఎద్దులు, దూడలు కలిపి మొత్తం 187 వరకూ ఉన్నాయి. ఇందులో పాలిచ్చే ఆవులు రోజూ 30 నుంచి 35 లీటర్ల పాలు ఇస్తున్నాయి. ఈ పాలను మూలస్థానంలోని స్వామి నిత్యాభిషేకం, నివేదనలకు వినియోగిస్తున్నారు. అలాగే అనుబంధ శ్రీవీరాంజనేయస్వామి, వరదరాజస్వామి, శ్రీమణికంఠేశ్వరస్వామి ఆలయాలకు కూడా పాలను సరఫరా చేస్తున్నారు. గోవులకు పచ్చిగడ్డితో పాటు ఎండు గడ్డి, దాణాను ఆలయ అధికారులే సమకూరుస్తున్నారు. అయితే గోవుల సంఖ్య క్రమేణా పెరగడంతో గోశాలలో ఉన్న మూడు షెడ్లు సరిపోని పరిస్థితి ఉంటోంది. కొత్తగా షెడ్డు నిర్మాణానికి 10 ఎకరాల భూమి అవసరమని ఇదివరకే అధికారులు కమిటీలో ప్రస్తావించారు. దీని అభివృద్ధికి పూర్తి స్థాయిలో అధికారులు దృష్టి సారించి 2020లో గోసంరక్షణ ట్రస్టును ఏర్పాటు చేశారు. గోశాలకు రక్షణ నిమిత్తం సీసీ కెమెరాలు కూడా బిగించారు.

గోసంరక్షణకు భక్తుల విరాళాలు

గోసంరక్షణకు భక్తులు భారీ మొత్తంలో విరాళాలు సమర్పిస్తున్నారు. ఇలా ఏటా ట్రస్టుకు రూ. 2కోట్ల పైగా విరాళ రూపంలో సమకూరుతోంది. గత ఏడాది గోమాతపూజ, ట్రస్టు నిర్వహణ కింద రూ.2,10,40,877లు చేకూరింది. అయితే నిర్వహణ ఖర్చుకు రూ.82,02,260లు అవుతోందని అధికారులు చెప్పారు.

దత్తతకు కోడెదూడలు, ఎద్దులు

కాణిపాకంలోని గోశాల నుంచి కొన్నేళ్లుగా కోడె దూడలు, ఎద్దులను దత్తతకు ఇస్తున్నారు. వీటిని దత్తతకు పొందాలంటే చిన్నకారు రైతు(హిందువు)లై ఉండాలి. దత్తతకు ఆసక్తి ఉన్న రైతులు ముందుగానే దేవస్థాన కార్యనిర్వహణాధికారి దరఖాస్తు ఇవ్వాలి. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, చిన్నకారు రైతు ధ్రువీకరణ పత్రం నకలు సమర్పించాలి. వీటిని అధికారులు పరిశీలించి గోసంరక్షణ ట్రస్టు, ధర్మకర్తల మండలితో చర్చించి వారి అనుమతితో దత్తత ఇస్తారు. దత్త ఇచ్చిన మరుసటి రోజు నుంచి కోడె దూడలు, ఎద్దులను ఆలయ అధికారులు పర్యవేక్షిస్తూ ఉంటారు. రైతులు దత్తతకు విరుద్ధంగా నడుచుకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. ఇప్పటి వరకు 40కిపైగా దత్తత ఇచ్చినట్లు అధికారులు చెప్పారు.

గోశాలను మరింతగా అభివృద్ధి



“గోశాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం. మరింతగా అభివృద్ధి చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. ఇది వరకే కమిటీలో కూడా పెట్టాం. త్వరలో గోశాలను 10 ఎకరాలో విస్తరించాలనే ప్రణాళికతో ఉన్నాం. భక్తులు, దాతలు సహకరిస్తే వీలైనంత త్వరగా దీనికి పునాదులు వేస్తాం. పశువైద్యాధికారికి నియామకానికి కూడా చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో ఆ ప్రక్రియను కూడా పూర్తి చేస్తాం. ప్రస్తుతం గోశాలలోని పశువులకు అగరంపల్లె పశువైద్యాధికారులతో వైద్యసేవలు అందిస్తున్నాం.

– వెంకటేశు, ఈఓ, కాణిపాకం దేవస్థానం

సార్.. సమస్యలు పరిష్కరించండి


భూ సమస్యను వివరించేందుకు వచ్చిన రైతులు


మామిడికి ధర కల్పించాలని కోరుతున్న భారతీయ కిసాన్ మోర్చా నాయకులు

- ప్రజాపరిష్కార వేదికలో ఆర్జీదారులు
- నాలుగు నెలల తర్వాత కార్యక్రమం

చిత్తూరు కార్పొరేషన్: ఎన్నికల ఫలితాలు, కోడ్ ముగిసిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. దాదాపు నాలుగు నెలల తర్వాత ఈ కార్యక్రమానికి పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన ఆర్జీదారులు తమ సమస్యలను పరిష్కరించండి అంటూ మొరపెట్టుకున్నారు. అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ షణ్మోహన్, జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. వీరితో పాటు డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ అర్జీలు స్వీకరించారు. మొత్తం 46 అర్జీలు వచ్చాయి. రెవెన్యూ శాఖ పరంగా 35, నేషనల్ హైవే ఒకటి, అగ్రికల్చరల్ శాఖ ఒకటి, డీఆర్‌డీఏ ఒకటి, చిత్తూరు నగరపాలక శాఖ ఒకటి, విభిన్న ప్రతిభా వంతుల శాఖ ఒకటి, పోలీసు శాఖ ఒకటి, జిల్ల ఉపాధి కార్యాలయం ఒకటి, హౌసింగ్ శాఖ ఒకటి, విద్యుత్ శాఖ ఒకటి, ఆరోగ్యశ్రీ ఒకటి, ఇతర సమస్యలన్నీ కలిపి మొత్తం 46 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

తోతాపురికి రూ.35 వేలు

తోతాపురి మామిడి టన్నుకి రూ.35 వేలు చెల్లించాలని భారతీయ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ధనుంజయనాయుడు కోరారు. ఈమేరకు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సిండికేట్‌గా గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు, ర్యాంపుల యాజమానులు మారి ధర లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. పంట నష్టపోయిన రైతులకు పంట బీమా సౌకర్యం వర్తింపచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మామిడి బోర్డు ఏర్పాటుచేసి.. రైతుల నుంచి నేరుగా పంటను కొనుగోలు చేయాలన్నారు. నిరసనలో హరిబాబుచౌదరి, రమేష్, మధు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి రక్షించండి

తమ స్థలాన్ని కబ్జా చేయాలని కొందరు దౌర్జన్యం చేస్తున్నారని రామకుప్పం మండలం అడవిబూదుగురు గ్రామానికి చెందిన రాణి, కణ్మని ఫిర్యాదు చేశారు. తమ గ్రామంలోని ఇద్దరు వ్యక్తుల నుంచి 19 ఏళ్ల కిత్రం 17 సెంట్ల భూమిని కొనుగోలు చేసి పంటలు సాగు చేసుకుంటున్నామన్నారు. ఆ భూములకు ప్రస్తుతం మంచి ధర ఉండడంతో తమపై దౌర్జన్యం చేస్తున్నారని, అధికారులు న్యాయం చేయాలని వేడుకున్నారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి


మృతురాలు మౌనిక

తవణంపల్లె: మండల కేంద్రంలో వివాహిత ఉరేసుకుని మృతి చెందింది. ఈ మృతిపై తమకు అనుమానంగా ఉందని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాణిపాకం ఎస్‌ఐ రామ్మోమోహన్ కథనం మేరకు... తవణంపల్లెకు చెందిన కె.అరుణ్‌కుమార్(27), ఎగువ తవణంపల్లె అరుంధతివాడకు చెందిన సంధ్యాదేవి కుమార్తె మౌనిక(22) మండల కేంద్రంలోని ఒక హోటల్‌లో పనిచేసే వారు. నాలుగేళ్ల కిందట ప్రేమించి మౌనికను అరుణ్‌కుమార్ కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ఒకటిన్నర సంత్సరం వయసున్న లిక్షిత అనే కుమార్తె ఉంది. వీరిరువురు తవణంపల్లెలోని ఒక బ్యాంకు ఉన్న భవనంపై అద్దెకు రూము తీసుకొని కొంత కాలంగా కాపురం ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం గదిలో ఫ్యాను కొక్కికి దారంతో ఆమె ఉరేసుకుంది. ఈమె కొక్కికి వేలాడతుండగా పక్కన నివాసం ఉంటున్న వారు గుర్తించారు. వెంటనే ఆమె భర్త అరుణ్‌కుమార్‌కు ఫోన్ చేశారు. ఆయన వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని కిందకి దింపారు. ఇంతలో మౌనిక తల్లి సంధ్యాదేవి, బంధువులు అక్కడికి వచ్చి మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. దీంతో మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. మంగళవారం మౌనిక తల్లి సంధ్యాదేవి స్టేషన్‌కు వెళ్లి తన కుమార్తెను చంపేసి ఉరివేసుకున్నట్లు చిత్రీకరిస్తున్నారని అరుణ్‌కుమార్‌పై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పరీక్ష నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తవణంపల్లె తహసీల్దార్ అరుణకుమారి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టమ్ నివేదిక వచ్చిన తర్వాతే మృతికి కారణాలు తెలుస్తాయని, బాధితులకు న్యాయం చేస్తామని ఎస్‌ఐ వివరించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

కుప్పంరూరల్: పంటల సాగు సమయంలో యాజమాన్య పద్ధతులు పాటించడంతోనే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కుప్పం మండలం, ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో కుప్పం, గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం మండలాలల రైతులకు డిజిటల్ గ్రీన్ ఫౌండేషన్‌తో కలిసి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పంటల సాగు సమయంలో యాజమాన్య పద్ధతులు, అధికారుల సూచనలు పాటిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధ్యమవుతుందన్నారు. అదే విధంగా కొబ్బరి పంట తెగుళ్ల నివారణకు మోనోక్రోటోపాస్ 10 మి.లీ.లను 10 మి.లీ. నీటిలో కలిపి చెట్టు వేరుకు పట్టించాలన్నారు. ఎండిన చెట్లకు కిలో యూరియా, రెండు కిలోల పాస్పేట్, 2.5 కిలోల మ్యూరేట్ మిశ్రమాన్ని కలిపి నీరు పెడితే చెట్లు త్వరగా కోలుకుంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీ హెచ్ ధనుంజయ్, డిజిటల్ గ్రీన్ ప్రతినిధి యశోద, ఏడీ కోటేశ్వరరావు, ఉద్యానాధికారి డింపుప్రియ, రైతులు పాల్గొన్నారు.

బంగరు భవితకు ‘డీ ఫార్మసీ’



తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్


ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థినులు

- రెండేళ్ల కాలపరిమితితో కోర్సు
- ఉద్యోగ, ఉపాధికి అధిక అవకాశాలు

తిరుపతి ఎడ్యుకేషన్ : విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు డిప్లొమా ఇన్ ఫార్మసీ (డీ ఫార్మసీ) కోర్సు దోహదపడుతోంది. రెండేళ్ల కాల పరిమితి గల ఈ కోర్సును అభ్యసించడం ద్వారా విద్యార్థులకు అధికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఫార్మసీ రంగంలో స్థిరపడేందుకు ఇది ఉత్తమమైన కోర్సు అని నిపుణులు పేర్కొంటున్నారు. ఔషధ రంగంలో వృత్తి నిపుణులను తీర్చిదిద్దేందుకు ఈ కోర్సు దోహదపడుతుంది.

ఉద్దేశం ఇదీ..

ఔషధ తయారీ, వాటిని పరీక్షించడం, మెడికల్ స్టోర్స్) నిర్వహణ, ఔషధాలను ఎలా పంపిణీ చేయాలి అనే విషయాలపై సమగ్ర అవగాహనే ఈ కోర్సు ఉద్దేశం. రెండేళ్లపాటు విద్యార్థులకు ఈ అంశాల్లో శిక్షణ ఇస్తారు.

ఉద్యోగావకాశాలు..

కోర్సు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయి. ఈఎస్ఐ, రైల్వే ఆస్పత్రులు, ప్రైవేటు హాస్పిటల్స్, మెడికల్ షాపులు, ఫార్మా కంపెనీల్లో ఫార్మాసిస్టులుగా ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. అలాగే సొంతంగా మెడికల్ షాపులు నిర్వహించుకోవచ్చు. అలాగే బీఫార్మసీ కోర్సులో చేరవచ్చు.

అర్హతలు ఇవీ..

డీ ఫార్మసీ కోర్సులో చేరేందుకు ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ చేసిన రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఓపెన్ స్కూల్స్ ద్వారా ఎంపీసీ, బైపీసీ ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడం ద్వారా అడ్మిషన్ పొందవచ్చు.

చక్కటి అవకాశాలు

“విద్యార్థులు తక్కువ సమయం, ఖర్చుతో జీవితంలో త్వరగా స్థిరపడేందుకు డీ ఫార్మసీ కోర్సు చాలా ఉత్తమం. తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 1964లో ప్రారంభించిన ఈ కోర్సు ద్వారా ఇప్పటి వరకు దాదాపు 60వేల మంది విద్యార్థులను ఫార్మాసిస్టులుగా అవకాశం పొందారు. వీరిలో చాలా మంది ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో రాణిస్తున్నారు. ఆసక్తి గల విద్యార్థులు పూర్తి వివరాలకు 99667 61446, 99088 57585 నంబర్లలో సంప్రదించవచ్చు.

– కృష్ణమూర్తి నాయుడు, హెచ్ఓడీ, ఫార్మసీ విభాగం, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్, తిరుపతి

తిరుపతి ఐఐటీలో
ఇన్నోవేషన్ వర్క్‌షాప్


విద్యాసంస్థలు, ప్రయోగశాలల ప్రతినిధులతో డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు : తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో అన్‌లాకింగ్ బ్యాటరీ ఇన్నోవేషన్‌పై వాటాదారుల వర్క్‌షాపును మంగళవారం నిర్వహించారు. ఐఐటీ, ఐసర్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ సమావేశంలో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ బ్యాటరీ తయారీ, సాంకేతిక అభివృద్ధిని ప్రోత్సహించడంపై దేశం దృష్టి సారించిందన్నారు. బ్యాటరీ తయారీ కోసం ర్యాపిడ్ ప్రోటో టైప్ సెంటర్(ఆర్‌పీసీ)ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యాచరణ పద్ధతులు, సౌకర్యాలను అర్థం చేసుకోవడమే ఈ సమావేశం లక్ష్యమన్నారు. ఆర్‌పీసీ స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈ, ఉత్పాదక సంస్థలకు వాణిజ్య ఉత్పత్తి సముదాయం స్థాపించడం, వాణిజ్య సెల్ తయారీ, కొత్త సాంకేతికతలను మూల్యాంకనం చేయడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందని వెల్లడించారు. దేశంలో బ్యాటరీ తయారీ, పర్యావరణ వ్యవస్థ, అభివృద్ధిపై వివిధ పరిశ్రమలు, ప్రభుత్వ ఏజెన్సీలతో చర్చలు జరుపుతున్నట్లు వివరించారు. బ్యాటరీ తయారీ, మెటీరియల్స్, సప్లై చైన్, ఎక్విప్‌మెంట్ తయారీ, స్టార్టప్‌లు తదితర అంశాలపై చర్చించారు. డాక్టర్ అనితా గుప్తా మాట్లాడుతూ భారతదేశం నిర్దేశించిన ప్రతిష్టాత్మకమైన నికర జీరో లక్ష్యాలను సాధించడంలో ఈవీ టెక్నాలజీలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఐసర్ డైరెక్టర్ శాంతన భట్టాచార్య మాట్లాడుతూ దేశంలో కణాల తయారీని పెంపొందించడం, ప్రోత్సహించడం, అభివృద్ధి చేయడానికి ఇలాంటి కేంద్రం అవసరమన్నారు. సమావేశానికి దేశంలోని వివిధ ప్రయోగశాలలు, విద్యాసంస్థల నుంచి 60 మంది ప్రతినిధులు హాజరైనట్లు వివరించారు. కార్యక్రమంలో ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ రఘునాథన్, ఐఈఎస్ఏ అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ వాలావల్కర్, డీఎస్టీ శాస్త్రవేత్త సురేష్ బాబు, ప్రొఫెసర్లు విజయ్, మోగేష్ శర్మ, శశిధర్ గుమ్మ పాల్గొన్నారు.

పొనగల్ గంగమ్మకు
ముక్కంటి సారె


ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

శ్రీకాళహస్తి: పట్టణంలోని పొనగల్‌లో వెలసిన గంగమ్మకు జాతర సందర్భంగా మంగళవారం శ్రీకాళహస్తీశ్వరుని తరపున సారె సమర్పించారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలోని అలంకార మండపం వద్ద సారెకు పూజలు చేశారు. అనంతరం పొన్నాలమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ముక్కంటి సారెను ఊరేగింపుగా తీసుకెళ్లి గంగమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. జాతర సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు, సత్రవాడ ప్రవీణ్ పాల్గొన్నారు.


సారె తీసుకెళుతున్న ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు

‘సుందరం’.. సుమనోహరం


పుష్కరిణిలో తెప్పపై సుందరరాజస్వామి విహారం

- వైభవంగా శ్రీపద్మావతీ అమ్మవారి తెప్పోత్సవాలు
- రెండోరోజు పుష్కరిణిలో విహరించిన సుందరరాజస్వామివారు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం శ్రీసుందరరాజస్వామివారు తెప్పపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, సహస్రనామార్చన, నిత్యార్చన నిర్వహించారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ముఖమండపంలో స్వామివారికి అభిషేకం జరిపించారు. సాయంత్రం 6.30 నుంచి 7.15 గంటల వరకు కనులపండువగా తెప్పోత్సవం నిర్వహించారు. సర్వాలంకాభూషితులైన స్వామివారు పద్మసరోవరంలో మూడు ప్రదక్షిణలు చేస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం శ్రీసుందరరాజస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. తెప్పోత్సవాల్లో మూడోరోజు బుధవారం శ్రీపద్మావతి అమ్మవారు తెప్పపై విహరించనున్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ గోవింద రాజన్, సూపరింటెండెంట్ మధు, అర్చకులు బాబు స్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సుభాష్, గణేష్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురైన ఉపాధి కూలీ మృతి


లావణ్య(ఫైల్)

పూతలపట్టు: వడదెబ్బకు గురైన చికిత్స పొందుతూ ఉపాధి కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని వడ్డేపల్లెలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు మండలంలోని వడ్డేపల్లె గ్రామానికి చెందిన మధు, భార్య లావణ్య(39) వడ్డేపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఈనెల 12వ తేదీ ఉపాధి హామీ బ్లాక్ ప్లాంటేషన్ పనులు చేస్తున్నారు. ఎండ తీవ్రతకు లావణ్య స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్ పుష్పరాజ్ ఆటో సహాయంతో పి.కొత్తకోటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయా ఆస్పత్రికి రెఫర్ చేశారు. వైద్యధికారులు రుయాలో చికిత్స అనంతరం స్విమ్స్‌కు రెఫర్ చేశారు. ఎండ తీవ్రతకు తలలో రక్తం గడ్డకట్టిందని గురువారం రాత్రి స్విమ్స్ లో వైద్యులు తలకు ఆపరేషన్ చేశారు. చికిత్స పొందుతూ లావణ్య మంగళవారం మృతి చెందింది. మృతురాలికి సాయి, సందీప్ ఇద్దరు పిల్లలు ఉన్నారు. లావణ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.